సాక్షి
వైఎస్సార్ జిల్లా

మంగళవారం । 24 । జూన్ । 2025



అర్జీలకు సకాలంలో పరిష్కారం

ప్రజలు సమర్పించే అర్జీలను సకాలంలో పరిష్కరించి న్యాయం చేయాలని డీఆర్ఓ విశ్వేశ్వరనాయుడు అధికారులను ఆదేశించారు.

-8లో



పదోన్నతులు కల్పించాకే..

పదోన్నతులు కల్పించిన తర్వాతే సచివాలయ ఉద్యోగులకు బదిలీలు నిర్వహించాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులు డిమాండ్ చేశారు.

-8లో

గరిష్టం/కనిష్టం
34.0/26.0

వాతావరణం

జిల్లాలో సోమవారం 26.0 - 34.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 7.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: కడప రిమ్స్ వద్ద ఉన్న ప్రభుత్వ మైనార్టీ ఐటీఐలో రెండవ విడత ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ మైనారిటీ ఐటీఐ ప్రధానచార్యులు జ్ఞానకుమార్ తెలిపారు. ఇందులో ఎలక్ట్రీషన్, కంప్యూటర్(కోపా), డిజిటల్ మెకానిక్, వెల్డర్ ట్రేడ్‌లో అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పదో తరగతి పాస్, లేదా ఫెయిల్ అయిన విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు వారి 10వ తరగతి మార్కుల జాబితా, టీసీ, కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్, ఫొటో, మెయిల్ ఐడీ, మొబైల్ నెంబర్‌లో ఆన్‌లైన్‌లో iti.apgov.inలో రిజిస్టర్ చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేయుటకు జులై 15వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. వివరాలకు 9642602764, 8074577318 నెంబర్‌లను సంప్రదించాలని ప్రిన్సిపాల్ వివరించారు.

జవహర్ నవోదయ విద్యాలయ ప్రవేశాలకు...

కడప ఎడ్యుకేషన్: జవహర్ నవోదయ విద్యాలయంలో 6వ తరగతి ప్రవేశ కోసం ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ షేక్ షంషుద్దీన్ తెలిపారు. ఉమ్మడి వైఎస్సార్ 2025–26 సంవత్సరంలో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునేందుకు జులై 27వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. పూర్తి వివరాలు www.navodaya.gov.in అను వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్లు డీఈఓ వివరించారు.

ఆసుపత్రి సీజ్



ఆసుపత్రి సీజ్ చేస్తున్న అధికారులు

పోరుమామిళ్ల: పట్టణంలోని సాయిలీల ఆసుపత్రిని సోమవారం ఆరోగ్యశాఖ అధికారులు తనిఖీ చేసి సీజ్ చేయడంతో పాటు తాళం వేశారు. ఇటీవల ఆసుపత్రిపై వచ్చిన ఆరోపణల నేపథ్యంలో డిప్యూటీ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ మల్లేష్, విచారణ అధికారి డాక్టర్ శివప్రసాదరెడ్డి సోమవారం తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్ గడువు ముగిసినా ఆసుపత్రి కొనసాగిస్తున్నారని గుర్తించి ఆసుపత్రిని మూసివేశారు. వారి వెంట పోరుమామిళ్ల మెడికల్ ఆఫీసర్ శ్రీవిద్య, ఆరోగ్య విద్యాధికారి సాధు వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ వెంకటేష్ ఉన్నారు.

ట్రిపుల్ ఐటీ ప్రవేశాలలో 163 మందికి చోటు

కడప ఎడ్యుకేషన్: రాజీవ్‌గాంధీ యూనివర్సిటీ ఆఫ్ నాలెడ్జ్ టెక్నాలజీస్‌లో ప్రవేశాలకు సంబంధించి వైఎస్సార్ జిల్లా నుంచి 163 మంది విద్యార్థులకు చోటు లభించింది. ఇందులో నూజివీడు ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో 28 మందికి, ఆర్‌కేవ్యాలీ క్యాంపస్‌లో 69 మందికి, ఒంగోలు ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో 46 మందికి, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో 20 మందికి సీట్లు లభించాయి.

చెమ్ముమియాపేట బాలికల హైస్కూల్లో 5 మందికి...

కడప నగరంలోని చెమ్ముమియాపేట బాలికల హైస్కూల్‌కు చెందిన ఐదు మంది విద్యార్థులకు ట్రిపుల్ ఐటీలో చోటు దక్కించుకోవడం విశేషం. ఇందులో యువశ్రీ, మానస, బాను, గాయత్రి, లక్ష్మి సుస్మ ఉన్నారు. వీరికి పూర్వపు ప్రధానోపాధ్యాయురాలు మేరీ అభినందించారు.

ప్రశాంతంగా మూడో రోజు కౌన్సెలింగ్



పత్రాలను పరిశీలించుకున్న అభ్యర్థులు

కడప ఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ కళాశాలల్లో ప్రవేశాల కోసం కడప నగర శివార్లలోని ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న మూడోరోజు పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రశాంతంగా జరిగింది. జిల్లావ్యాప్తంగా 32001వ ర్యాంకు నుంచి 50 వేల ర్యాంకులకు సంబంధించిన అభ్యర్థులు తమ ధ్రువపత్రాలను పరిశీలించుకున్నారు. మూడవ రోజు కౌన్సెలింగ్‌కు 200 మంది అభ్యర్థులు హాజరయ్యారు. ఈ కౌన్సెలింగ్ కార్యక్రమంలో కో ఆర్డినేటర్ సీహెచ్ జ్యోతి, ఛీఫ్ వెరిఫికేషన్ ఆఫీసర్ దామోదర్, వెరిఫికేషన్ ఆఫీసర్లు అనిత, బాగ్యశ్రీ, రేణుకా, రాజేష్‌లతో పాటు కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

నేటి కౌన్సెలింగ్‌కు...

నేడు నిర్వహించబోయే కౌన్సెలింగ్ కార్యక్రమానికి జిల్లావ్యాప్తంగా 50001 నుంచి 68 వేల ర్యాంకులు వచ్చిన అభ్యర్థులు హాజరుకావాలని కో ఆర్డినేటర్ సీహెచ్ జ్యోతి తెలిపారు.

బాబు ష్యూరిటీ ▸ వెన్నుపోటుకు గ్యారెంటీ

- రెడ్‌బుక్ అమలుపై ఉన్న ఆసక్తి విద్యార్థి, యువజన సమస్యలపై లేదు
- పెన్నులు ఉండాల్సిన విద్యార్థుల చేతుల్లో ప్లకార్డులు తీసుకొచ్చారు
- వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య ధ్వజం
- యువత పోరు విజయవంతం



కడప కార్పొరేషన్: చంద్రబాబు ష్యూరిటీ వెన్నుపోటుకు గ్యారెంటీ అని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు దేవిరెడ్డి ఆదిత్య విమర్శించారు. రాష్ట్ర యువజన విభాగం పిలుపు మేరకు సోమవారం జిల్లా పార్టీ కార్యాలయం నుంచి భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి జెండా ఊపి ప్రారంభించారు. పార్టీ కార్యాలయం నుంచి మొదలైనకలెక్టరేట్ వరకూ చేరింది. ర్యాలీలో విద్యార్థులు ప్లకార్డులు ప్రదర్శిస్తూ కూటమి ప్రభుత్వం విద్యార్థులు..యువతకు శాపం, నిరుద్యోగ భృతి ఎప్పుడిస్తావు బాబూ అంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం జిల్లా డీఆర్‌ఓకు వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేవిరెడ్డి ఆదిత్య మాట్లాడుతూ ఎన్నికల ముందు 20లక్షల ఉద్యోగాలు ఇస్తానని హామీ ఇచ్చిన చంద్రబాబు, 4లక్షల మంది ఉద్యోగాలు ఊడగొట్టారన్నారు. తన కుమారుడు లోకేష్‌కు మాత్రమే ఉద్యోగం దక్కిందని, మిగిలిన వారికెవ్వరికీ ఉద్యోగాలు రాలేదన్నారు. కూటమి ప్రభుత్వం బకాయిలు ఇవ్వకుండా విద్యార్థులను వేధిస్తోందన్నారు. పెన్నులు ఉండాల్సిన విద్యార్థుల చేతుల్లో ప్లకార్డులు వచ్చాయని ఆవేదన వ్యక్తం చేశారు. నాలుగు గోడల మధ్య పాఠాలు వినే విద్యార్థులకు కూటమి నేతల కుర్చీలను లాగేసి ఈ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పడం పెద్ద పనికాదని హెచ్చరించారు. రాష్ట్ర యువజన విభాగం ఉపాధ్యక్షుడు షేక్ షఫీవుల్లా మాట్లాడుతూ చంద్రబాబు అంటే మోసం, వైఎస్ జగన్ అంటే నమ్మకమన్నారు. తమ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మాట్లాడేవారు ఉండకూడదని, అందరిపై అక్రమ కేసులు బనాయిస్తున్నారన్నారు. రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గురుప్రసాద్ మాట్లాడుతూ ప్రశ్నిస్తానన్న పవన్ కళ్యాణ్ సినిమా షూటింగ్‌లకే పరిమితమయ్యార ని ఎద్దేవా చేశారు. ఈ కార్యక్రమంలో వలంటీర్ల విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, యువజన విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి సొహైల్‌ఖాన్, నగర అధ్యక్షుడు గుంటి నాగేంద్ర, ప్రొద్దుటూరు నియోజకవర్గ అధ్యక్షుడు గురునాథరెడ్డి, మైదుకూరు అధ్యక్షుడు చంద్ర ఓబుల్‌రెడ్డి, బద్వేల్ అధ్యక్షుడు నరసింహారెడ్డి, పులివెందుల అధ్యక్షుడు లక్ష్మణ్‌రెడ్డి, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు సంబటూరు ప్రసాద్‌రెడ్డి, పాకా సురేష్, సీహెచ్ వినోద్, త్యాగరాజు, మునిశేఖర్‌రెడ్డి, ఏ1 నాగరాజు, కంచుపాటి బాబు,సుబ్బారాయుడు మహిళానేతలు బి. మరియలు, క్రిష్ణవేణి, నారాయణమ్మ, తులశమ్మ, మల్లీశ్వరి, సుజిత పాల్గొన్నారు.



ర్యాలీగా వెళుతున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి, యువజన విభాగం నాయకులు, కార్యకర్తలు



యువత పోరు ర్యాలీని జెండా ఊపి ప్రారంభిస్తున్న జిల్లా అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి



డీఆర్వో విశ్వేశ్వరనాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న యువజన విభాగం నాయకులు

నిరుద్యోగ భృతి ఇచ్చే వరకూ పోరాటం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి



రాష్ట్రంలోని నిరుద్యోగులందరికీ నిరుద్యోగ భృతి ఇచ్చే వరకూ పోరాటం ఆగదని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు పి. రవీంద్రనాథ్‌రెడ్డి హెచ్చరించారు. వైఎస్సార్‌సీపీ పోరాటం చేస్తేనే తల్లికి వందనం పథకాన్ని అమలు చేశారని, అందులో కూడా 50 శాతం మందికి నగదు జమ కాలేదన్నారు. విద్యాకానుక, వసతి దీవెన పథకాలు సక్రమంగా అమలు కాలేదన్నారు. విద్యార్థులకు యూనిఫారం ఇచ్చారే తప్పా షూ, బ్యాగ్, టై, బెల్టు వంటివి ఇవ్వలేదన్నారు.

వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం

కడప ఎడ్యుకేషన్: వైయస్సార్ కడప జిల్లా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సాధించారు. వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ లండన్ వారు అందించిన సర్టిఫికెట్ సోమవారం సాయంత్రం అమరావతిలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి, ఎస్పీ ఈజీ అశోక్ కుమార్‌తో కలిసి అందుకున్నారు. యోగాంధ్ర 2025 కార్యక్రమంలో భాగంగా మే 21 నుంచి జూన్ 21 వరకు జిల్లా వ్యాప్తంగా యోగా ఆంధ్ర కార్యక్రమాలు నిర్వహించిన విషయం తెలిసిందే. జూన్ 21న వైఎస్ రాజారెడ్డి స్టేడియంలో 'ఫ్యామిలీ యోగ థీమ్' తో యోగా నిర్వహణకు గాను వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు లభించింది.



సీఎం చంద్రబాబు చేతుల మీదుగా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌ను అందుకుంటున్న కలెక్టర్, ఎస్పీ

29నుంచి జూనియర్ ఫుట్‌బాల్ పోటీలు

మదనపల్లె సిటీ: మదనపల్లె సమీపంలోని వేదా పాఠశాలలో ఈనెల 29,30 తేదీల్లో రాష్ట్ర స్థాయి జూనియర్ ఫుట్‌బాల్ ఛాంపియన్ షిప్ పోటీలు జరగనున్నట్లు జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు దిలీప్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు సోమవారం పాఠశాల కరస్పాండెంట్, ప్రిన్సిపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర స్థాయి పోటీలకు అన్ని ఏర్పాట్లు చేయాలని కోరారు. ఆయన వెంట ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి మురళీధర్,కోచ్ మహీంద్ర పాల్గొన్నారు.

25న వైఎస్సార్‌సీపీలో చేరుతున్నా

జెడ్పీ మాజీ చైర్మన్ సుబ్రమణ్యం

రాయచోటి: వైఎస్సార్‌సీపీ నేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సమక్షంలో ఈనెల 25వ తేదీన వైఎస్సార్‌సీపీలో చేరుతున్నట్లు జెడ్పీ మాజీ చైర్మన్ సుగవాసి సుబ్రమణ్యం ప్రకటించారు. సోమవారం ఈ విషయాన్ని రాయచోటిలో విలేకరులకు వెల్లడించారు. రాజంపేట మాజీ ఎంపీ, రాయచోటి మాజీ ఎమ్మెల్యే దివంగత నేత సుగవాసి పాలకొండ్రాయుడు పెద్ద కుమారుడు సుగవాసి సుబ్రమణ్యం 20 రోజుల కిందట తెలుగుదేశం పార్టీకి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. 2024 సాధారణ ఎన్నికల్లో రాజంపేట అసెంబ్లీ నుంచి టీడీపీ అభ్యర్థిగా ఈయన పోటీలో ఉన్నారు. ఈ సందర్భంగా మీడియాతో సుబ్రమణ్యం మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీలో చేరిక విషయం ఈ రోజు తీసుకున్న నిర్ణయం కాదన్నారు. గత పది సంవత్సరాలుగా ఎన్నో సందర్భాల్లో తన తండ్రితో చర్చించడం జరిగిందన్నారు. ప్రజా సంక్షేమం కోసం తన తండ్రిబాటలో నడిచి, భవిష్యత్తులో వారి సేవా భావానికి అనుగుణంగా తాను వేసే ప్రతి అడుగు ఉంటుందన్నారు.

అంగన్వాడీలకు పథకాలు వర్తింపజేయాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న అంగన్వాడీలు

కలెక్టరేట్ ఎదుట ధర్నా

కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్రంలోని అంగన్వాడీలందరికీ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులురెడ్డి, మనోహర్, అంగన్వాడీ యూనియన్ ప్రధాన కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, లక్ష్మీదేవి మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా ప్రభుత్వం వేతనాలు పెంచలేదన్నారు. రూ.12 వేలలోపు ఆదాయం ఉన్న వారందరికీ సంక్షేమ పథకాలు అమలు చేస్తామని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కానీ, అంగన్వాడీ వర్కర్లు రూ. 11,500, హెల్పర్లు, మినీ వర్కర్లు రూ. 7000 మాత్రమే గౌరవ వేతనం పొందుతున్నప్పటికీ వారికి సంక్షేమ పథకాలు అందించకపోవడం విచారకరమన్నారు. అంగన్వాడీలకు తల్లికి వందనం ఇవ్వాలని, రిటైర్డ్ అయిన వారికి పెన్షన్లు మంజూరు చేయాలన్నారు. రేషన్‌కార్డులకు దరఖాస్తు చేసుకోగా, ప్రభుత్వ ఉద్యోగులంటూ తిరస్కరించడం భావ్యం కాదన్నారు. వీటితోపాటు లేబర్ కోడ్స్ రద్దు చేసి అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కోరారు. కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మారుస్తూ జీఓ జారీ చేయాలని కోరారు. సీపీఎం నగర కార్యదర్శి ఆదిరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, సీఐటీయూ నాయకులు చంద్రారెడ్డి, సత్యనారాయణ, ఐఎస్‌సుబ్బమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ చదువు..
భవితకు ఆదరువు

- ఓపెన్ స్కూల్స్‌లో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదల
- దరఖాస్తుకు జులై 31 వరకు గడువు
- 14 ఏళ్లు నిండిన వారు పదికి, 15 ఏళ్లు నిండిన వారు ఇంటర్‌కు అర్హులు

కడప ఎడ్యుకేషన్: చదువు మధ్యలో ఆగిందనో.. వయసై పోయిందనో దిగులు చెందాల్సిన అవసరం లేదు.. మనసుంటే మార్గం ఉంటుందన్నట్టు... చదువు కోవాలనే తపన ఉండాలేకానీ చదువు కోవడానికి.. సర్టిఫికెట్లు పొందడానికి వయసు అడ్డంకి కానేకాదిప్పుడు. వివిధ కారణాలలో విద్యకు దూరమైన వారు తిరిగి తమ చదువు కొనసాగించేందుకు విద్యాశాఖ దూర విద్యా విధానంలో సార్వత్రిక విద్యాపీఠం(ఏపీ ఓపెన్ స్కూల్) ద్వారా పది, ఇంటర్ విద్యను కొనసాగించే అవకాశం కల్పించింది.

ఉన్నత విద్యకు సోపానం

ఉద్యోగాల పదోన్నతులకు, ఉన్నత విద్యను అభ్యసించేందుకు ఈ మార్గం ఎంతో ఉపయుక్తంగా ఉంది. ఈ పథకం 1991లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అమలులోకి తెచ్చింది. అప్పట్లో దీనికి పెద్దగా ఆదరువు లేకపోయినా డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఈ పథకానికి మహర్దశ పట్టింది. దూర విద్య ద్వారా పదవ తరగతి అనే పథకం తిరికి అమలు లోకి తీసుకోచ్చారు. దీంతోపాటు తిరిగి 2010–11లో ఇంటర్ విద్యను ప్రవేశపెట్టారు. ఈ సొసైటీ ద్వారా పొందే ఇంటర్, పదవ తరగతి సర్టిఫికెట్లు రెగ్యులర్ స్కూల్, కళాశాలల్లో పొందే సర్టిఫికెట్లతో సమానం అని ప్రభుత్వ ప్రకటించింది. దీంతో మరింత ఆదరణ లభించింది.

జిల్లాలో స్టడీ సెంటర్ల వివరాలు ఇలా ...

జిల్లావ్యాప్తంగా పదవ తరగతికి 70 స్టడీ సెంటర్లు, ఇంటర్మీడియట్‌కు సంబంధించి 70 ఓపెన్ స్కూల్ స్టడీ సెంటర్లు ఉన్నాయి. ఈ విధానంలో విద్యా విషయక సబ్జెక్టులతోపాటు వృత్తి విద్యా సంబంధించి కోర్సులు అందుబాటులో ఉన్నాయి. ఈ స్కూల్ ధ్రువపత్రం ద్వారా ఉన్నత చదువులు, వృత్తి విద్యాకోర్సులను అభ్యసించవచ్చు. ఇంటర్‌కు సంబంధించి సైన్సు గ్రూపులతోపాటు ఆర్ట్స్ గ్రూపులు కూడా అందుబాటులో ఉన్నాయి. ఈ కోర్సులు పూర్తి చేసేందుకు వయో పరిమితి లేదు.

అర్హతలు ఇవే...

పదిలో చేరేందుకు ఈ ఏడాది ఆగస్టు 31వ తేదీ నాటికి 14 ఏళ్లు నిండి ఉండాలి, గరిష్ట వయో పరిమితి ఉండదు. చదవడం, రాయడం తెలిసి ఉండాలి. దరఖాస్తుతోపాటు టీసీ, రికార్డు సీటు, పుట్టిన తేదీ, ధ్రువీకరణ పత్రం సమర్పించాలి. అలాగే ఇంటర్మీడియట్‌లో చేరే వారికి ఆగస్టు 31వ తేదీ నాటికి 15 ఏళ్లు నిండి ఉండాలి. ఇంటర్‌కు 10వ తరగతి మార్కుల జాబితా, పదవ తరగతి టీసీని దరఖాస్తుతోపాటు అందజేయాలి, ఎస్సీ, ఎస్టీ, బీసీ అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రం, విద్యాంగ అభ్యర్థులు ధ్రువీకరణ పత్రాన్ని అందచేయాల్సి ఉంటుంది. ఇతర సమాచార కోసం www.apopenschool.org వెబ్‌సైట్‌ను సంప్రదించాలి.

సెలవుల్లో తరగతుల నిర్వహణ...

ఓపెన్ స్కూల్లో పది, ఇంటర్ అడ్మిషన్ పొందిన వారికి సాధారణ విద్యకు భిన్నంగా సార్వత్రిక తరగతులను నిర్వహిస్తారు. ఓపెన్ స్కూల్ చదువు సంబంధించిన క్లాసులను సెలవు రోజుల్లో నిర్వహిస్తారు. ఎంపిక చేసిన స్టడీ సెంటర్లలో జరిగే తరగతులకు అభ్యర్థులు హాజరు కావాల్సి ఉంటుంది. ఇంటర్ సైన్సు గ్రూపునకు సంబంధించి ఎంపిక చేసిన కేంద్రాల్లో ప్రాక్టికల్ పరీక్షల క్లాసులకు హాజరుకావాలి. ప్రతి అభ్యాసకుడు కనీసం 30 తరగతులకు హాజరుకావాల్సి ఉంటుంది.



క్లాసులో ఓపెన్ స్కూల్ అభ్యాసకులు (ఫైల్)

ప్రవేశ వివరాలు	తేదీ
అడ్మిషన్లు ప్రారంభం తేదీ	12-06-2025
ఆన్‌లైన్ చేయడానికి చివరితేదీ	30-07-2025
ఫీజు చెల్లించడానికి చివరితేదీ	31-07-2025

అడ్మిషన్ల వివరాలు...
2023-23 విద్యా సంవత్సరం: **6885**
2024-25 విద్యా సంవత్సరం: **7694**

▸▸ ప్రవేశాలు ఇలా...

ఈ నెల 12వ తేదీ నుంచి ఆన్‌లైన్‌లో అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభమైంది. అపరాధ రుసుం లేకుండా జులై 30 తేదీలోగా ఆన్‌లైన్‌లో అడ్మిషన్ పొందవచ్చు. పదవ తరగతికి సంబంధించి జనరల్ పురుషులకు రిజిస్ట్రేషన్, అడ్మిషన్ ఫీజు కలిపి రూ. 1550, అన్ని వర్గాల స్త్రీలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, పీహెచ్‌సీ పురుషులకు రిజిస్ట్రేషన్, అడ్మిషన్ పీజు రూ. 1150 చెల్లించాల్సి ఉంది. అలాగే ఇంటర్‌కు సంబంధించి జనరల్, పురుషులకు రూ. 1800, అన్ని వర్గాల మహిళలకు, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్‌సీ, మైనార్టీలకు రూ. 1500 చొప్పున ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

నోటిఫికేషన్ వెలువడింది



ఈ ఏడాదికి సార్వత్రిక విద్యా ప్రవేశాలకు సంబంధించి నోటిపికేషన్ వెలువడింది. గ్రామీణ బాలికలు, మహిళలకు, యువత,గృ హిణులు, ఉద్యోగులు సైతం సద్వినియోగం చేసుకోవచ్చు. మహిళలకు రాయితీ ఉంది. ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీలు, దివ్యాంగులకు ఫీజుల్లో కూడా రాయితీ ఉంది.

–సాంబశివారెడ్డి, ఓపెన్ స్కూల్ జిల్లా కో ఆర్డినేటర్

సద్వినియోగం చేసుకోండి



వివిధ కారణాలతో చదువలేక పోయినవారికి, చదువు మధ్యలో నిలిపివేసిన వారికి సార్వత్రిక విద్య ఓ వరం లాంటింది. పది, ఇంటర్ పూర్తిచేయడానికి ఈ ఏడాది నోటిఫికేషన్ వెలువడింది. అందరూ సద్వినియోగం చేసుకోవాలి. గామీణ ప్రాంతాల్లో నిరక్షరాస్యతను తగ్గించేందుకు ప్రభుత్వం ఓపెన్ స్కూల్‌ను ప్రవేశపెట్టింది. ఓపెన్ స్కూల్ రెగ్యులర్ విద్య సర్టిఫికెట్‌తో సమానం. ఉన్నత చదువులు, ఉద్యోగాలకు కూడా ఉపయోగపడుతుంది.

– షేక్ షంషుద్దీన్, జిల్లా విద్యాశాఖాధికారి . వైఎస్సార్‌కడపజిల్లా

క్లుప్తంగా

మద్యం మత్తులో చెలరేగిపోయిన యువకులు



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న స్థానికులు

జమ్మలమడుగు : ఎర్రగుంట్ల పట్టణం కడప రహదారిలో యువకులు మద్యం తాగి కత్తులు, రాడ్‌లతో చెలరేగిపోయారు. విషయం తెలుసుకున్న పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ నియోజకవర్గం చాగలమర్రి గ్రామానికి చెందిన కొంత మంది యువకులు ప్రత్యేక వాహనంలో ఎర్రగుంట్లకు వచ్చి కడప రహదారిలో ఉన్న మద్యం షాపులో మద్యం తాగారు. బయటికి వచ్చిన తర్వాత ఎర్రగుంట్ల పట్టణానికి చెందిన యువకులతో గొడవకు దిగారు. దీంతో చాగలమర్రికి చెందిన యువకులు కారులో ఉన్న రాడ్లు, కత్తులను బయటికి తీసి బెదిరింపులకు పాల్పడ్డారు. పోలీసులు యువకులను అదుపులోకి తీసుకుని విచారణ చేపట్టారు.

బంగారు నగలు అపహరణ

జమ్మలమడుగు రూరల్ : పట్టణంలోని పాతబస్టాండ్‌లో ప్రయాణికురాలి బ్యాగ్ నుంచి 6 తులాల బంగారు చోరీ జరిగినట్లు ఎస్ఐ హైమావతి తెలిపారు. కొండాపురం మండలం తాళ్ల ప్రొద్దుటూరు గ్రామానికి చెందిన ప్రవల్లిక తన భర్తతో కలసి స్వగ్రామమైన పెద్దముడియం మండలం జంగాలపల్లె గ్రామానికి వెళ్లేందుకు జమ్మలమడుగు బస్టాండ్‌కు వచ్చింది. కొద్ది సేపటికి బస్సు రావడంతో హ్యాండ్ బ్యాగ్ తీసుకుని భర్తతో కలసి బస్సు ఎక్కింది. కాసేపటి తర్వాత బ్యాగ్ చూసుకోగా అందులో బంగారు నగలు ఉన్న చిన్న బ్యాగ్ కనిపించలేదు. వెంటనే భర్తతో కలసి జమ్మలమడుగు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. బాధితురాలు బస్సు ఎక్కుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడినట్లు తెలిసింది.

• చెరువు మట్టి.. చెరబట్టి!



టిప్పర్లలో తరలిపోతున్న చెరువు మట్టి



వాహనాల ధాటికి దెబ్బ తిన్న రోడ్డు

కూటమి ప్రభుత్వం వచ్చాక అధికార పార్టీ నాయకుల అక్రమాలకు అడ్డూ అదుపు లేకుండా పోయింది అనడానికి దేవుని కడప చెరువు నుంచి అక్రమంగా తరలిపోతున్న మట్టి సజీవ సాక్ష్యంగా నిలుస్తోంది. నిబంధనల ప్రకారం సమీప రైతులు ట్రాక్టర్ల ద్వారా చెరువు మట్టిను పంటలో సత్తువ కోసం తోలుకుంటారు. కానీ కడప నగరంలో టీడీపీ నేతలు అక్రమంగా టిప్పర్ల ద్వారా ప్రైవేట్ రియల్ ఎస్టేట్ వెంచర్లలలో మట్టిని తోలుకుని లక్షలాది రూపాయల సొమ్మును ప్రభుత్వ ఖజానాకు చేరకుండా కొల్లగొట్టేస్తున్నారు. ఇంత జరుగుతున్నా అధికారులు ఏమీ తెలియనట్టు వ్యవహరిస్తున్నారు. దేవుని కడప చెరువు నుంచి శ్రీ లక్ష్మి వెంకటేశ్వర స్వామి ఆలయం మీదుగా నిత్యం టిప్పర్లు తరలిపోతున్నాయి. దీంతో దర్శనానికి వచ్చే భక్తులు, స్థానికులు ఇబ్బంది పడుతున్నారు. దీనికితోడు భారీ వాహనాల రద్దీతో రోడ్లపై గుంతలు ఏర్పడ్డాయి. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆందోళనకు దిగుతామని స్థానికులు హెచ్చరిస్తున్నారు.

• గండికోట.. వ్యర్థాల మేట!

జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతమైన గండికోటలో వారాంతంలో పర్యాటకుల రద్దీ విపరీతంగా ఉంటోంది. ఇదే సమయంలో మందుబాబుల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటోంది. ఫలితంగా తాగి పడేసిన మద్యం సీసాలు, గాజు ముక్కలు ఇలా పలు వ్యర్థాలు ఎక్కడ పడితే అక్కడ కోటలో దర్శనమిస్తున్నాయి. దీంతో పర్యాటకులు అడుగు తీసి అడుగు వెయ్యాలంటే ఇబ్బందిగా మారింది. అసాంఘిక కార్యకలాపాలు కూడా జోరుగా సాగుతున్నాయనే ప్రచారం



చెత్తకుప్పలో దర్శనమిస్తున్న మద్యం సీసాలు

ఉంది. గండికోట పరిరక్షణ, పరిసరాల పరిశుభ్రతపై అధికారులు చర్యలు చేపట్టాలని పర్యాటకులు కోరుతున్నారు.



గండికోటలో పర్యాటకులు

ఎస్.కె.మహమ్మద్ రఫీ, సాక్షి ఫొటోగ్రాఫర్, కడప

విద్యాహక్కు చట్టం అమలు చేయాలి

కడప ఎడ్యుకేషన్ : విద్యాహక్కు చట్టానికి తూట్లు పొడుస్తున్న ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసు యాదవ్ డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను దళిత మిత్ర సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు రామాంజనేయులు, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ శ్రీనివాసులుతో కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యా సంవత్సరం ప్రారంభమైనప్పటి నుంచి అడ్మిషన్లు ఫుల్ అయ్యాయని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఫీజు నియంత్రణ చేయడంలో విద్యాశాఖ విఫలమైందన్నారు. విద్యాశాఖ అధికారులు స్పందించి ఫీజు నియంత్రణతోపాటు విద్యాహక్కు చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు.



డీఈఓకు వినతిపత్రం సమర్పిస్తున్న ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసు

వాహనాలపై ప్రెస్, పోలీసు స్టిక్కర్లపై స్పెషల్ డ్రైవ్

కడప కోటిరెడ్డి సర్కిల్ : జిల్లాలో కొందరు జర్నలిస్టులు, పోలీసులు కాకున్నా తమ వాహనాలపై ప్రెస్, పోలీస్ అని స్టిక్కర్లు అతికించుకుని తిరుగుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ ఇ.జి.అశోక్‌కుమార్ హెచ్చరించారు. ఈ మేరకు ఎస్పీ పత్రికా ప్రకటన విడుదల చేశారు. ప్రెస్, పోలీస్ విధులతో సంబంధం లేనివారు వాహనాలపై స్టిక్కర్లు అతికించడం చట్టవ్యతిరేకమని తెలిపారు. సంబంధిత గుర్తింపు కార్డులు లేకుండా తిరిగే వారి వాహనాలను స్పెషల్ డ్రైవ్ చేపట్టి తనిఖీ చేస్తామన్నారు. నిబంధనలు ఉల్లంఘించే వారి వాహనాలను సీజ్ చేస్తామని తెలిపారు. అలాగే కొందరు అనధికారికంగా వాహనాలకు సైరన్లు బిగించి ధ్వని కాలుష్యానికి, తోటి వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్నట్లు తెలిసిందన్నారు. అలాంటి వాహనాలను తనిఖీలలో గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటాని పేర్కొన్నారు.

అర్జీలకు సకాలంలో పరిష్కారం

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజలు సమర్పించే అర్జీలను సకాలంలో పరిష్కరించి న్యాయం చేయాలని డీఆర్ఓ విశ్వేశ్వరనాయుడు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించి పరిశీలించారు. అర్జీలను సంబంధిత శాఖలకు పరిష్కార నిమిత్తం పంపారు.

■ జిల్లాలోని సంక్షేమ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని, ఎస్సీ, ఎస్టీ, బీసీ వార్డెన్ల అక్రమాస్తులపై ఏసీబీ దాడులు చేయించాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు బీఎం ఓబులేశు యాదవ్, ఏపీ దళిత మిత్ర సంఘం అధ్యక్షుడు కె.రామాంజనేయులు, ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు కోరారు. హాస్టళ్లలో కనీస వసతులు లేవని, మెస్, కాస్మోటిక్ ఛార్జీలు విడుదల చేయాలన్నారు. ఖాళీ పోస్టులు భర్తీ చేయాలన్నారు. కడప, బద్వేలు, ప్రొద్దుటూరు, ఖాజీపేట ప్రాంతాల్లో కొంతమంది వార్డెన్లకు రెండు, మూడు హాస్టల్స్ ఇన్‌ఛార్జిగా ఇవ్వడంతో అవినీతికి ఆస్కారం కలుగుతోందన్నారు. అధికారులకు ఇవ్వాలంటూ ప్రతినెల ఒక్కొక్క విద్యార్థి నుంచి రూ. 50–100 వసూలు చేస్తున్నారని ఆరోపించారు.

■ భారీ స్థాయిలో అవినీతికి పాల్పడిన జిల్లా మైనారిటీ శాఖ అధికారి ఇమ్రాన్‌ను సర్వీసు నుంచి తొలగించాలని కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎస్ఏ సత్తార్, నజీర్ అహ్మద్, ఆప్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, సీపీఐ(ఎంఎల్) జిల్లా కన్వీనర్ ఓబయ్య తదితరులు కోరారు. ఆర్టీసీలో పనిచేస్తున్న ఇమ్రాన్‌ను డిప్యుటేషన్‌పై జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారిగా నియమించి వక్ఫ్‌బోర్డు బాధ్యతలు కూడా అప్పగించారన్నారు. ఆ శాఖకు చెందిన రూ. 3.70 కోట్ల నిధులు బ్యాంకుల నుంచి డ్రా చేసుకుని తినేశారని ఆరోపించారు. ఆయనపై తక్షణమే క్రిమినల్ కేసు నమోదు చేయడమే కాకుండా డబ్బు రికవరీ చేయాలన్నారు.

ఈ కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటపతి, డీఈఓ షంషుద్దీన్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న డీఆర్ఓ విశ్వేశ్వరనాయుడు

ప్రయాణికురాలి బ్యాగు చోరీ

ముద్దనూరు : స్థానిక 4 రోడ్ల కూడలిలో ఓ మహిళ హ్యాండ్‌బ్యాగ్‌లో నుంచి సొమ్ము చోరీ జరిగింది. ముద్దనూరుకు చెందిన మహిళ సోమవారం ఓ బేకరి వద్ద కడప బైపాస్ రైడర్ బస్సు ఎక్కుతుండగా ఆమె భుజానికి తగిలించుకున్న హ్యాండ్ బ్యాగ్‌లో ఉన్న రూ.1300 నగదును చోరీ చేశారు. బస్సులో ప్రయాణిస్తున్న సమయంలో ఆ మహిళ దానిని గుర్తించింది.

పాఠశాల తరలించవద్దు



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు, గ్రామస్తులు

కడప సెవెన్‌రోడ్స్ : తమ గ్రామంలో ఎన్నో ఏళ్ల నుంచి ఉన్న ప్రాథమిక పాఠశాలను తరలించవద్దని అట్లూరు మండలం కుంభగిరి పంచాయతీలోని రంగంపల్లె కాలనీ వాసులు డిమాండ్ చేశారు. పాఠశాల తరలింపునకు నిరసనగా సోమవారం ఆ గ్రామస్తులు కలెక్టరేట్ ఎదుట ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ పాఠశాలను చెన్నంపల్లె నుంచి ఎస్.వెంకటాపురం గ్రామానికి తరలించారన్నారు. ఆ గ్రామానికి పిల్లలు వెళ్లాలంటే సరైన రోడ్డు సౌకర్యం లేదని, చుట్టూ కంపచెట్లు ఉన్నాయని, ఇందువల్ల పిల్లలు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఎప్పటిలాగానే చెన్నంపల్లె గ్రామంలోనే ప్రాథమిక పాఠశాలను కొనసాగిస్తే 350 కుటుంబాలకు చెందిన విద్యార్థులకు సౌలభ్యంగా ఉంటుందన్నారు. అధికారులు తమ సమస్యను దృష్టిలో ఉంచుకుని పాఠశాలను చెన్నంపల్లెలోనే కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం డీఆర్వో విశ్వేశ్వరనాయుడుకు వినతిపత్రం సమర్పించారు.

ఉత్సాహంగా ఏసీఏ అండర్-19 మల్టీ మ్యాచ్‌లు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏసీఏ అండర్–19 మల్టీ మ్యాచ్‌లు రెండవ రోజు కొనసాగాయి. కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో జరుగుతున్న మ్యాచ్‌లో కడప జట్టు గెలుపు దిశగా పయనిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో కడప జట్టు 399 పరుగులు చేసింది. సోమవారం రెండవ రోజు తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన చిత్తూరు జట్టు 31.3 ఓవర్లలో 97 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. చిత్తూరు జట్టులో లోహిత్ లక్ష్మీ నారాయణ 22 పరుగులు చేశాడు. కడప జట్టులోని చరణ్‌రెడ్డి అద్భుతంగా బౌలింగ్ చేసి 4 వికెట్లు తీశాడు. శివశంకర్ 2 వికెట్లు, ఆర్దిత్ రెడ్డి 2 వికెట్లు తీశారు. అనంతరం రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 44.1 ఓవర్లలో 169 పరుగులకు అన్ని వికెట్లు కోల్పోయింది. కడప జట్టులోని కుళ్లాయప్ప 37, ఆర్దిత్ రెడ్డి 35 పరుగులు చేశారు. చిత్తూరు జట్టులోని తేజేశ్ అద్భుతంగా బౌలింగ్ చేసి 5 వికెట్లు తీశాడు. సాయి చరణ్ 2 వికెట్లు, ప్రకాశ్‌రాజ్ 2 వికెట్లు తీశారు. అనంతరం చిత్తూరు జట్టు ఆట ముగిసే సమయానికి 6 ఓవర్లలో 2 వికెట్లు కోల్పోయి 12 పరుగులు చేసింది.

వైఎస్ఆర్ఆర్ ఏసీసీ స్టేడియంలో..

వైఎస్ఆర్ఆర్ స్టేడియంలో జరిగిన మ్యాచ్‌లో 362 ఓవర్ నైట్ స్కోర్‌తో రెండవ రోజు బ్యాటింగ్ చేసిన నెల్లూరు జట్టు 123.3 ఓవర్లలో 464 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఆ జట్టులోని సయ్యద్ షాహుల్ హమీద్ 89, చైతన్య తేజ 72 పరుగులు చేశారు. కర్నూలు జట్టులోని సొషన్ కళ్యాణ్ అద్భుతంగా బౌలింగ్ చేసి 5 వికెట్లు తీశాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన కర్నూలు జట్టు 46.1 ఓవర్లలో అన్ని వికెట్లు కోల్పోయి 171 పరుగులు చేసింది. ఆ జట్టులోని సాయి గణేష్ 49, రోహిత్ 38 పరుగులు చేశారు. నెల్లూరు జట్టులోని తోషిత్ యాదవ్ బౌలింగ్‌లో రాణించి 5 వికెట్లు తీశాడు. తేజ, భార్గవ్ మహేష్ రెండేసి వికెట్లు తీశారు.

మా కుమారుడిని క్షమాభిక్షపై విడుదల చేయండి

కడప కోటిరెడ్డి సర్కిల్ : ఒక హత్య కేసులో గత 15 ఏళ్లుగా కడప కేంద్ర కారాగారంలో జీవిత ఖైదు శిక్షను అనుభవిస్తున్న తమ కుమారుడు జి.యుగంధర్ (ఖైదీ నెంబర్ 3980)ను క్షమాభిక్షపై విడుదల చేయాలని తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం జంగాలపల్లె గ్రామానికి చెందిన జి.చెంగమ్మ వేడుకుంటున్నారు. ఈ మేరకు ఆమె సోమవారం ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. అలాగే రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేష్, హోం మంత్రి అనితలకు వినతి పత్రాలను పంపారు. వివరాలు ఇలా.. తన కుమారుడు యుగంధర్ జైలులో డిగ్రీ, పీజీ ఎం.ఏ సోషియాలజీ చదివి బంగారు పతకం సాధించాడన్నారు. మూడేళ్లుగా పీఎల్‌వీగా పనిచేసి జడ్జి మన్ననలు పొందారన్నారు. తన కుమారుడు జైలుకు వెళ్లడం వల్ల తన భర్త కుమారుడి మీద బెంగతో మరణించాడన్నారు. గత ప్రభుత్వంలో తాను, తన భర్త పలుమార్లు అర్జీలు సమర్పించామని తెలిపారు. తన కుమారుడిని విడుదల చేసేందుకు యూ/ఎస్ 364 ఐటీసీ, 302 ఐటీసీ, మైనర్ల సెక్షన్లు అడ్డుపెట్టి విడుదల కాకుండా గత 15 ఏళ్లుగా కడప జైలులో ఉంచారన్నారు. తన భర్త మరణించిన తర్వాత కుటుంబ పోషణ చాలా కష్టంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం 65 ఏళ్లు ఉండటం వల్ల కళ్లు సరిగా కనిపించడం లేదని, మెరుగైన వైద్యం చేయించేవారు ఎవరూ లేరని తన కుటుంబానికి తన కొడుకే దిక్కు అని తెలిపారు. మానవతా దృక్పథంతో తమ కుమారుడికి క్షమా భిక్ష ప్రసాదించి విడుదల చేయాలని ఆమె కోరారు.

రిమ్స్‌లో అనాథ మృతదేహం

కడప కోటిరెడ్డి సర్కిల్ : కడప రిమ్స్ మార్చురీలో అనాథ మృతదేహం ఉందని అసిస్టెంట్ ప్రొఫెసర్ జి.సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12వ తేదీ ఆర్‌కే నగర్‌కు చెందిన యు.బాల వెంకటేష్(68) అనే పేరుతో ఓ వ్యక్తిని రిమ్స్‌లో అడ్మిట్ చేశారన్నారు. ఆయన సోమవారం మృతి చెందాడన్నారు. మృతునికి సంబంధించిన వారు రిమ్స్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

ప్రొద్దుటూరు వైఎస్సార్‌సీపీ ఎంపీపీపై దాడి

- స్థల వివాదంలో ఎంపీపీ, ఆయన సతీమణి శాంతిపై దాడి చేసిన టీడీపీ అనుచరులు
- కొత్తపల్లె పంచాయతీ కార్యాలయంలోనే సబ్‌రిజిష్టర్ ఆఫీసు సీళ్లు తయారి
- తద్వారా తప్పుడు డాక్యుమెంట్లను సృష్టించిన టీడీపీ నాయకులు
- మీడియాతో ఎంపీపీ శేఖర్‌యాదవ్, ఆయన సతీమణి సర్పంచ్ శాంతి



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ఎంపీపీ శేఖర్‌యాదవ్ దంపతులు



దాడికి గురైన ఎంపీపీ శేఖర్‌యాదవ్, ఆయన సతీమణి శాంతి

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు ఎంపీపీ సానబోయిన శేఖర్‌యాదవ్, ఆయన సతీమణి సోములవారిపల్లె సర్పంచ్ శాంతిపై సోమవారం రాత్రి టీడీపీ నాయకులు దాడికి పాల్పడ్డారు. ఖాదర్‌బాద్‌లో ఉన్న తమ స్థలంలోని నిర్మాణాలను కూలుస్తున్నారని సమాచారం తెలియడంతో శేఖర్‌యాదవ్ దంపతులు హుటా హుటీన ఘటనా వెళ్లారు. అక్కడికి వెళ్లగానే 19 వార్డు కౌన్సిలర్ మునీర్, కొత్తపల్లె సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి అనుచరులు వారిపై దాడికి పాల్పడ్డారు. వెంటనే రూరల్ పోలీసులు రంగ ప్రవేశం చేయడంతో పెద్ద గండం తప్పినట్లైంది. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం సానబోయిన శేఖర్ యాదవ్ ఆరు నెలల క్రితం కొత్తపల్లె పంచాయతీలోని ఖాదర్‌బాద్ గ్రామంలో 489–2 సర్వే నంబర్‌లో 10 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేశారు. ఆ స్థలంలో ఇటీవల తాత్కాలిక షెడ్డు పనులను ప్రారంభించారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి 19 వార్డు కౌన్సిలర్ మునీర్, శివచంద్రారెడ్డి అనుచరులు ఆ నిర్మాణాలను రాడ్డులతో కూల్చే ప్రయత్నం చేశారు. అయితే రాడ్డులతో నిర్మాణాలు కూలకపోవడంతో జేసీబీని తెప్పించారు. అప్పటికే విషయం తెలుసుకున్న ఎంపీపీ సానబోయిన శేఖర్‌యాదవ్, ఆయన భార్య సర్పంచ్ శాంతి ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఎందుకు కూలుస్తున్నారని వారిని ప్రశ్నిస్తుండగా ఇక్కడ నీ స్థలం ఎక్కడ ఉందంటూ టీడీపీ నాయకుల అనుచరులు వారిపై దాడి చేశారు. విషయం తెలియడంతో ప్రొద్దుటూరు మున్సిపల్ వైస్ చైర్మన్ బంగారు రెడ్డితో పాటు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున ఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసుల సూచన మేరకు ఎంపీపీ శేఖర్‌యాదవ్ రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లారు. తనతో పాటు తన సతీమణి ఎస్సీ కులస్తురాలైన శాంతిని కులం పేరుతో దూషించారని శేఖర్‌యాదవ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

'వరద' రాజ్యంలో విధ్వంసం ..

తాను శాంతి కాముకుడను.. నిజాయితీగా పని చేస్తానని ఎప్పుడు గొప్పలు చెప్పుకునే ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి నియోజకవర్గంలో ఆయన అనుచరులు విధ్వంసం సృష్టిస్తున్నారని ఎంపీపీ శేఖర్‌యాదవ్ తెలిపారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఒక బీసీ ఎంపీపీతో పాటు దళిత మహిళా సర్పంచ్‌పై దాడికి పాల్పడటం సిగ్గు చేటన్నారు. ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి, ఆయన కుమారుడు కొండారెడ్డిలు చెప్పే మాటలకు, జరిగే సంఘటనలకు సంబంధం ఉండదన్నారు. ఆరు నెలల క్రితం ఖాదర్‌బాద్‌లో టీడీపీ నాయకుల వద్దనే 10 సెంట్ల స్థలాన్ని కొనుగోలు చేశానని చెప్పారు. కొత్తపల్లె పంచాయతీ కార్యాలయంలోనే సర్పంచ్ కొనిరెడ్డి చంద్రారెడ్డి, కౌన్సిలర్ మునీర్‌లు కలిసి సబ్ రిజిస్టర్ కార్యాలయానికి సంబంధించిన సీళ్లను తయారు చేశారన్నారు. ఇప్పుడు వెళ్లి చూసినా పంచాయతీ కార్యాలయంలో దొంగ సీళ్లు ఉంటాయన్నారు. వాటి ద్వారా ఫేక్ డాక్యుమెంట్లను తయారు చేసి స్థలాన్ని కొట్టేసే ప్రయత్నం చేస్తున్నారని చెప్పారు. ఈ విషయాన్ని రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అయినా పోలీసులు చర్యలు తీసుకోలేదన్నారు. ఎమ్మెల్యే వరదరాజుల రెడ్డి, కొండారెడ్డి చెప్పారని ఎస్ఐ అరుణ్‌రెడ్డి కేసును పట్టించుకోలేదన్నారు. రెండు నెలలుగా పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరుగుతున్నానన్నారు. తన స్థలం వద్దకు వెళ్తే ఇది శివచంద్రారెడ్డి అడ్డా అంటూ తమపై దాడి చేశారని తెలిపారు. షరీఫ్, గౌస్, మునీర్ తమ్ముడు, మరో 15 మంది శివచంద్రారెడ్డి అనుచరులు తమపై దాడి చేసినట్లు ఆయన ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు.

పదోన్నతులు కల్పించాకే బదిలీలు నిర్వహించాలి



కార్పొరేషన్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సచివాలయ ఉద్యోగులు



సచివాలయ ఉద్యోగులకు సంఘీభావంగా ధర్నాలో కూర్చున్న మేయర్ సురేష్ బాబు

సచివాలయ ఉద్యోగుల డిమాండ్

కడప కార్పొరేషన్ : పదోన్నతులు కల్పించిన తర్వాతే సచివాలయ ఉద్యోగులకు బదిలీలు నిర్వహించాలని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక కడప మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట వారు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వకుండానే వివిధ సచివాలయాలకు డిప్యుటేషన్లు వేశారని, ప్రస్తుతం స్కూళ్లు, కాలేజీలు తెరిచిన నేపథ్యంలో వేరే మండలాలకు, మున్సిపాలిటీలకు బదిలీలు చేస్తే తమ పిల్లల చదువుకు ఇబ్బందులు ఏర్పడుతాయన్నారు. గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగులకు వారు విధుల్లో చేరినప్పటినుంచి నోషనల్ ఇంక్రిమెంట్లు ఇవ్వాలని, స్థానిక మండలం, స్థానిక మున్సిపాలిటీల్లోనే బదిలీలు కల్పించాలన్నారు. గుర్తింపు పొందిన అసోసియేషన్ల ఆఫీస్ బేరర్లకు బదిలీల నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. అంతర్ జిల్లా బదిలీలు కల్పించాలన్నారు. రేషనలైజేషన్ తర్వాత మిగిలిన ఉద్యోగులను ఎక్కడ సర్దుబాటు చేస్తారో చెప్పాలన్నారు. పర్మినెంట్ ఉద్యోగులకు ఇస్తున్న విధంగా డీఏలు, పీఆర్సీ సచివాలయ ఉద్యోగులకు వర్తింపజేయాలని కోరారు.

సచివాలయ ఉద్యోగుల ఆందోళనకు మేయర్ మద్దతు

గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల ఆందోళనకు మేయర్ సురేష్ బాబు మద్దతు తెలిపారు. సోమవారం కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఆయన వారికి సంఘీభావంగా ధర్నాలో కూర్చున్నారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. స్థానిక మండలాలు, మున్సిపాలిటీల్లోనే వారిని బదిలీ చేయాలని కోరారు. భవిష్యత్‌లో వారి పోరాటానికి వైఎస్సార్‌సీపీ పూర్తి మద్దతు ఇస్తుందని తెలిపారు.